ముమ్మాటికీ గుడ్డి దర్బారే!

మొదటిపేజీ తరువాయి...

అధికారిక ఉత్తర్వుల్లో అంగీకరించింది. ఏడో తేదీన తమ దృష్టికి వచ్చినట్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో 'అసలు ప్రభుత్వానికి ఈ విషయం తెలియకపోతే మాత్రం అది సిగ్గు చేటు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పింది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఇతర అంశాలను పరిశీలిస్తే..

- రెండో తేదీన సంఘటన జరుగగా ఇంజినీర్లు వాస్తవానికి పంపుహౌస్‌లోకి నీళ్లు వచ్చాయని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కానీ వాళ్లు ఈ అంశంపై లోతుగా వాకబు చేయలేదు. ముఖ్యంగా సీపేజ్ వాటర్ వచ్చిందంటూ ప్రచారం చేయడంతో ఇతర ఇంజినీర్లు కూడా పెద్దగా పట్టించుకోలేదు. మరి సైట్ ఇంజినీర్లుగాని, ఏజెన్సీగాని ఘటనను ఎందుకు తొక్కిపెట్టి, సీపేజ్ వాటర్ అని ప్రచారం చేశారనేది తేలాల్సి ఉన్నది.
- 'నమస్తే తెలంగాణ' ఈ నెల ఏడో తేదీన ఘటనాస్థలికి వెళ్లి పరిశీలన చేసి ఎనిమిదో తేదీన వీడియో, వివరాలను వెలుగులోకి తెచ్చింది. తర్వాత అటు సర్కారు, ఇటు జలమండలిలో హడావుడి మొదలైంది. కాగా ఈ నెల ఏడో తేదీన ఈ అంశం తమ దృష్టికి వచ్చిందని బుధవారం జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొనడం హాస్యాస్పదంగా ఉన్నదని పలువురు విమర్శిస్తున్నారు.
- సంఘటన వెలుగులోకి వచ్చిన ఈ నెల 8న జలమండలి అధికారికంగా వివరణ ఇచ్చింది. అందులో ఏజెన్సీ ఇన్‌ఫ్లోను సరిగా అంచనా వేయకపోవడమే ఘటనకు ప్రధాన కారణమని పేర్కొన్నది. కానీ జలమండలి పూర్తిస్థాయి బాధ్యులను చేసిన ఏజెన్సీపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నదనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. తొలుత బోర్డు అధికారిక వాట్సాప్ గ్రూప్‌లో ఏజెన్సీకి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు పేర్కొన్నారు. కానీ ఎలాంటి అధికారిక ఉత్తర్వులు వెలువడ లేదు. దీంతో ప్రభుత్వం ఈ విషయంలో దోబూచులాడుతున్నదనే విమర్శలు వస్తున్నాయి.
- కమిటీ తన నివేదికలో నాగార్జునసాగర్‌కు ఒక్కసారిగా 4.90 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో గేటు కొట్టుకుపోయి, గోడ కూలిందని పేర్కొన్నట్టుగా విశ్వసనీయ సమాచారం. కానీ సంఘటన జరిగిన రెండో తేదీ ఉదయం ఆరు గంటలకు నీటిపారుదల శాఖ అధికారికంగా విడుదల చేసిన ప్రాజెక్టుల లెవల్ షీట్స్‌లో నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో 3,36,543 క్యూసెక్కులుగా ఉన్నది. ఒకటో తేదీ సాయంత్రం ఆరు గంటలకు 3,69,866 క్యూసెక్కులుగా ఉన్నది. చివరికి ఘటన వెలుగులోకి వచ్చిన ఎనిమిదో తేదీన కూడా నాగార్జునసాగర్ ఇన్‌ఫ్లో 3,19,408 క్యూసెక్కులుగానే ఉన్నది. అంటే నాలుగు లక్షల క్యూసెక్కులు లేదు. అలాంటిది సుమారు ఐదు లక్షల క్యూసెక్కుల వరకు అంటూ ఇన్‌ఫ్లోను పెంచి మూపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- ఈ నేపథ్యంలో ఒక్కసారిగా ఇన్‌ఫ్లో పెరగడం అనేది కాకుండా వానకాలంలో అందునా సాగర్ నీటిమట్టం పెరుగుతున్న క్రమంలో సొరంగంలో గేటు ఏర్పాటు చేసి, పనులు పూర్తి కాకముందే సొరంగాన్ని ఓపెన్ చేయడమే ఘటనకు ప్రధాన కారణమని నిపుణులు స్పష్టంచేస్తున్నారు.
- మరోవైపు సుంకిశాల వంటి కీలకమైన ప్రాజెక్టుల వద్ద క్షేత్రస్థాయిలో ఉండే మేనేజరు (ఏఈఈ) ప్రధానం. ముఖ్యంగా సివిల్ ఇంజినీర్లను నియమిస్తేనే ప్రయోజనం ఉంటుంది. కానీ బోర్డు ఉన్నతాధికారులు అక్కడ గత నెల 31వరకు విధుల్లో ఉంచిన మేనేజర్ సివిల్ ఇంజినీర్ కాదని, డిప్లొమా పూర్తి చేసినందున ఆయనను సూపర్‌వైజర్‌గానే పరిగణిస్తారని పలువురు ఇంజినీర్లు తెలిపారు. పైగా ఆయన హౌసింగ్‌బోర్డు నుంచి డిప్యూటేషన్‌పై జలమండలికి వచ్చారు. దీంతో పాటు ఆయన బదిలీల్లో భాగంగా వెళ్లిన తర్వాత నియమించిన, ప్రస్తుతం సస్పెన్షన్‌కు గురైన హరీశ్ కూడా సివిల్ ఇంజినీర్ కాదు. ఎలక్ట్రానిక్స్ విభాగానికి చెందిన ఇంజినీర్. అంటే బోర్డు ఉన్నతాధికారులు పనుల పర్యవేక్షణలో ఆదినుంచీ నిర్లక్ష్యంగా ఉన్నారనేందుకు ఇది మరో ఉదాహరణ అని పలువురు పేర్కొంటున్నారు.

ఇప్పుడేమంటరు భట్టిగారూ?

ఈ ఘటనపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తొలుత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెపాన్ని నెట్టేందుకు ప్రయత్నించారు. నాసిరకం పనుల వల్లే ఇలా జరిగిందని దబాయించారు. ఈ ప్రయత్నం విఫలం కావడంతో మరుసటి రోజు మంత్రుల బృందం 'ఇది చిన్న ఘటన' అని చిత్రీకరించేందుకు ప్రయత్నించింది. కాగా నాసిరకం నిర్మాణమే కారణమైతే పర్యవేక్షణ లోపం కారణంగా ఇంజినీర్లపై చర్యలెందుకు తీసుకున్నారని, ప్రభుత్వ తాజా చర్యలు భట్టి మాటలు వట్టివేనని చెప్పకనే చెప్పాయని పలువురు రాజకీయ విశ్లేషకులు స్పష్టంచేస్తున్నారు.

నిజామాబాద్‌లోని జీజీహెచ్‌లో అందోళన చేస్తున్న జూడాలు

'కోల్‌కతా' నిందితులను కఠినంగా శిక్షించాలి

- రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ డాక్టర్ల నిరసన
- వైద్యుల భద్రతకు ప్రత్యేక చట్టం తేవాలని డిమాండ్

వరంగల్ చౌరస్తా/ఖలీల్‌వాడి/మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 14: కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ హాస్పిటల్ అండ్ మెడికల్ కళాశాల ట్రైనీ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. వరంగల్, జనగామ, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో బుధవారం నిరసనలు తెలిపారు. వరంగల్ ఎంజీఎంలోని డాక్టర్లు విధులు బహిష్కరించి దవాఖానలోని గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. జూనియర్ డాక్టర్ల ధర్నాకు ఐఎంఏ సభ్యులు, నర్సింగ్ విద్యార్థులు మద్దతు తెలిపారు. జనగామలోని ఆర్టీసీ చౌరస్తాలో డాక్టర్స్ అసోసియేషన్, జూనియర్ డాక్టర్ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నిజామాబాద్‌లోని జీజీహెచ్‌లో వైద్యులు, వైద్య విద్యార్థులకు భద్రత కల్పించాలని జూనియర్ డాక్టర్లు దవాఖాన ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌ను హతమార్చిన ఘటనను నిరసిస్తూ.. మహబూబ్‌నగర్‌లో మెడికోలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో జనరల్ వార్డును పరిశీలించి సూపరింటెండెంట్, వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

సర్కారు దవాఖానల్లో కలెక్టర్ల తనిఖీలు

- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలు దవాఖానల పరిశీలన
- వార్డుల్లో పర్యటన.. మందులు, వైద్య సేవలపై వాకబు

సూర్యాపేట/నీలగిరి/ఆలేరు రూరల్, ఆగస్టు 14: 'సర్కారు దవాఖానలకు సమస్యల సుస్తీ' శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో బుధవారం ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కలెక్టర్లు, ఇతర అధికారులు దవాఖానల్లో తనిఖీ చేసి సమస్యలపై ఆరా తీశారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖాన లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి రోగులకు అందుతున్న వైద్యం, సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. అనంతరం వార్డుల్లో తిరిగారు. సూపరింటెండెంట్‌ను అడిగి మందుల వివరాలను తెలుసుకున్నారు. తుంగతుర్తిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లను పరిశీలించి వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు.

స్టార్టప్‌లకు సీడీఎఫ్‌డీ ఆహ్వానం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్ట్ 14(నమస్తే తెలంగాణ): ఆలోచనలను ఆవిష్కరణలుగా తీర్చిదిద్దుకునేందుకు సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ ఇంక్యుబేషన్ సెంటర్ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తుంది. మాలిక్యులార్ డయాగ్నోస్టిక్స్, ఇండస్ట్రీయల్ బయోటెక్నాలజీ, బయోమెడికల్ డివైజ్, అగ్రికల్చర్ బయోటెక్నాలజీ, థెరపాటిక్స్ అంశాల్లో పనిచేసే స్టార్టప్‌లకు ఇంక్యుబేషన్ సేవలను అందించనుంది. 18లోగా దరఖాస్తు చేసుకోవాలి.

వ్యవసాయ వర్సిటీకి 37వ ర్యాంక్

వ్యవసాయ యూనివర్సిటీ, ఆగస్టు 14: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో 37వ ర్యాంకు సాధించిందని రిజిస్ట్రార్ డాక్టర్ రఘు రామిరెడ్డి తెలిపారు. బోధన, పరిశోధన, విస్తరణ విభాగాల్లో జాతీయస్థాయిలో 145 వ్యవసాయ, అనుబంధ సంస్థలు పాల్గొన్నాయని తెలిపారు.

స్కిల్ వర్సిటీపై గెజిట్ జారీ

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ తెలంగాణ' గెజిట్ జారీ అయ్యింది. ఈ బిల్లు ఇటీవలే అసెంబ్లీలో ఆమోదం తెలపగా, గవర్నర్ సైతం ఈ వర్సిటీ ఏర్పాటు బిల్లును ఆమోదించారు. దీంతో న్యాయశాఖ సెక్రటరీ ఆర్ తిరుపతి బుధవారం గెజిట్ జారీచేశారు.

పిటిషనర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించాలి

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం స్థానికత నిబంధనను మార్చడాన్ని సవాలు చేసిన కేసుల్లో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. స్థానికతపై నిర్ణయం తీసుకునే వరకు పిటిషనర్ల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించాలని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను 26కి వాయిదా వేసింది.

నలుగురు ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు

నల్గొండ జిల్లాలోని సుంకిశాల వద్ద నాగార్జునసాగర్ ఫోర్‌షోర్ నుంచి శాశ్వత ప్రాతిపదికన హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరా కోసం చేపట్టిన ప్రాజెక్టులో రిటైనింగ్ వాల్ నిలువునా కుప్పకూలిన ఘటనపై వారం పాటు గోప్యత పాటించడం రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఘటన ఈ నెల రెండో తేదీన జరిగితే 'నమస్తే తెలంగాణ' ఎనిమిదో తేదీ ఎడిషన్ ద్వారా వెలుగులోకి తెచ్చింది. దీంతో ఘటన వివరాలు, వీడియో ఒక్కసారిగా సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో రాష్ట్ర ప్రభుత్వం ఉలిక్కిపడింది. జలమండలిలోని ముగ్గురు ఇంజినీర్లతో వేసిన త్రిసభ్య కమిటీ నివేదికను సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన నుంచి వచ్చిన రోజే పురపాలక శాఖ అందించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలకు ఉపక్రమించింది. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు జలమండలిలోని నలుగురు ఇంజినీర్లపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. త్రిసభ్య కమిటీ నివేదిక ఆధారంగానే చర్యలు తీసుకున్నట్టుగా స్పష్టం చేసింది. పాజెక్టు డివిజన్ సర్కిల్-3 (సుంకిశాల)లో పనిచేస్తున్న సీజీఎం ఎస్. కిరణ్‌కుమార్, జీఎం బీ మరియరాజ్, డీజీఎం ఎన్ ప్రశాంత్, మేనేజర్ కేవీపీ హరీశ్‌ను సస్పెండ్ చేస్తూ పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్‌ను ప్రాధాన్యత లేని పోస్టుకు బదిలీ చేశారు. టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్‌కు ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ బాధ్యతలు అప్పగించారు. ఘటన వెలుగులోకి వచ్చాక సంబంధిత ఇంజినీర్లను ఎండీ ఆశోక్‌రెడ్డి వివరణ కోరగా వారి సమాధానం సంతృప్తికరంగా లేకపోవడం, ఇంజినీర్ల సాంకేతిక పర్యవేక్షణ లోపాన్ని కమిటీ ఎత్తిచూపినందున ఈ చర్యలు తీసుకున్నట్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. జల మండలిలో ఏకకాలంలో నలుగురు ఇంజినీర్లపై ఒకేసారి వేటు పడటం బోర్డులో భారీ కుదుపునకు దారితీసింది.

మనస్తాపంతో తల్లీకూతురు ఆత్మహత్య

ఎల్లవ్వ (ఫైల్)

పోచవ్వ (ఫైల్)

చేగుంట, ఆగస్టు 14 : ఒంటరితనం, పక్కవారి నుంచి పలుకరింపులు లేక పోవడంతో మనస్తాపంతో తల్లీకూతురు ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం రెడ్డిపల్లిలో బుధవారం వెలుగుచూసింది. స్థానికులు, చేగుంట పోలీసుల కథనం ప్రకారం.. రెడ్డిపల్లికి చెందిన తలారి ఎల్లవ్వ (70), పోచవ్వ(50) తల్లీకూతుళ్లు. మక్క రాజిపేటకు చెందిన లావణ్యకు రెడ్డిపల్లి వాసి తలారి మృత్యంతో వివాహం జరగ్గా.. కుటుంబ కలహాలతో ఆరు నెలల క్రితం బావిలో పడి లావణ్య అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. లావణ్య మృతికి భర్త, అత్త, ఆడపడుచు కారణమంటూ మృతురాలి బంధువుల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భర్త మృత్యం, అత్త తలారి ఎల్లవ్వ, ఆడపడుచు తలారి పోచవ్వపై కేసు నమోదైంది. దీంతోపాటు వారికి ఉన్న కొద్దిపాటి వ్యవసాయ భూమిని లావణ్య తల్లి పేరిట రిజిస్ట్రేషన్ చేయించే వరకు మూడు రోజులపాటు మృతదేహానికి దహన సంస్కారాలు జరగనివ్వలేదు. జైలు నుంచి వచ్చిన మృత్యం బతుకుదెరువు కోసం తన పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. తలారి ఎల్లవ్వ, ఆమె కూతురు పోచవ్వ మాత్రం రెడ్డిపల్లిలోని ఇంట్లోనే ఉంటున్నారు. ఇరుగుపొరుగు వారు వీరితో మాట్లాడటం లేదు. ఒంటరితనం భరించలేక తీవ్ర మనోవేదనకు గురైన తల్లీకూతురు మంగళవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత్యం ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డం గీసే కత్తితో గొంతు కోసి..

పాత కక్షల నేపథ్యంలో దారుణ హత్య

మణికొండ, ఆగస్టు 14: ఓ వ్యక్తిని గడ్డం గీసే కత్తితో గొంతుకోసి హత్య చేసిన నిందితుడు పోలీసులకు లొంగిపోయిన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నార్సింగి సీఐ హరికృష్ణరెడ్డి తెలిపిన ప్రకారం.. నార్సింగి కుమ్మరి బస్తీకి చెందిన కొండ రాజు (48) సెలూన్‌ను నిర్వహిస్తున్నాడు. రాజుకు భార్య వరలక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇదే ప్రాంతంలోని సమీప బంధువైన ప్రవీణ్‌కుమార్‌తో రాజుకు కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. డిసెంబర్ 31న తమ ఇంటి ఎదుట ముగ్గులు చెరిపేశాడని ప్రవీణ్‌తో గొడవపడి, నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. దీంతో రాజుపై కక్ష పెంచుకున్న ప్రవీణ్ మంగళవారం అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి రాజును గడ్డం చేసే కత్తితో గొంతుకోసి హత్య చేశాడు. బుధవారం ఉదయం నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త మరణాన్ని తట్టుకోలేక గుండెపోటుతో భార్య మృతి

భద్రాద్రి జిల్లా మణుగూరులో విషాదం

సోమయ్య, శంకరమ్మ దంపతులు(ఫైల్)

మణుగూరు టౌన్, ఆగస్టు 14 : పాలం పనులకు వెళ్లిన భర్త గుండెపోటుతో విగతజీవిగా మారాడు. భర్త లేడని తెలుసుకున్న భార్య గుండె బరువెక్కింది. 'నీవు లేక నేనెందుకు' అనుకుందేమో.. భర్తతోపాటు ఆమె కూడా గుండెపోటుతో తనువు చాలించింది. ఈ విషాదకర ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో బుధవారం చోటుచేసుకున్నది. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. బాలాజీనగర్‌లో నివాసం ఉండే రిటైర్డ్ సింగరేణి కార్మికుడు కొమ్ము సోమయ్య (72), శంకరమ్మ (65) భార్యాభర్తలు. వారికి ముగ్గురు పిల్లలు. సోమయ్య బుధవారం పొలం వద్ద పనులు చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుతో మృతి చెందాడు. గమనించిన తోటి రైతులు అతడి మృతదేహాన్ని ఇంటికి తరలించారు. భర్త మృతదేహాన్ని చూసిన శంకరమ్మ షాక్‌కు గురై గుండెపోటుతో అక్కడికక్కడే తనువు చాలించింది.

లక్షకుపైగా దరఖాస్తులు రిజెక్ట్?

క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే తిరస్కరణ

- పై నుంచి వచ్చిన ఒత్తిడి మేరకే చేశామంటున్న అధికారులు
- రాష్ట్రవ్యాప్తంగా ఫీజుల రూపంలో రైతులకు రూ.కోట్ల నష్టం
- సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- మళ్లీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలంటున్న అధికారులు
- దరఖాస్తులపై ఉపముఖ్యమంత్రి, రెవెన్యూమంత్రి విరుద్ధ ప్రకటనలు

కరీంనగర్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కేసీఆర్ సర్కారు హయాంలో తెచ్చిన ధరణి పోర్టల్ దశాబ్దాల భూసమస్యలకు దారిమాపింది. దీనిని అభాసుపాలు చేసేందుకు కాంగ్రెస్ సర్కారు తీవ్రంగా కష్టపడుతున్నది. భూ సమస్యల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే తిరస్కరిస్తూ, రైతులపై ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నది. రాష్ట్ర వ్యాప్తంగా లక్షకుపైగా దరఖాస్తులను తిరస్కరించగా, అందరికీ ఒకే రకమైన కారణాలు చూపటం గమనార్హం. ఉదాహరణకు.. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలానికి చెందిన రైతు గుమ్మడి అంజయ్య.. మిస్సింగ్ సర్వే నంబర్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఈ అర్జీని గ్రామపంచాయతీ బోర్డుపై అతికించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. గడువులోగా ఎటువంటి అభ్యంతరాలు రాలేదని అధికారులు తెలిపారు. కానీ, భూమిని సాదాబైనామా ద్వారా వేరే వ్యక్తులకు అమ్మారని, మోఖాపై వేరేవాళ్లు ఉన్నారన్న కారణాలను చూపుతూ అప్లికేషన్‌ను తిరస్కరించారు. నిజంగానే సాదాబైనామాపై విక్రయించినా, లేదా మోకాపై వేరేవాళ్లు ఉన్నా పంచాయతీపై నోటీసు బోర్డులో అతికించినప్పుడే అభ్యంతరం చెప్పేవారు కదా? అన్న ప్రశ్నలకు అధికారుల వద్ద సమాధానం లేదు. ఇదే ఫార్మాట్‌లో వేల దరఖాస్తులను తిరస్కరించారు.

జూలై 5-10వ తేదీ మధ్యే భారీగా రిజెక్ట్

ధరణి పోర్టల్‌లోని 35 మాడ్యూళ్ల కింద రైతులు తమ రెవెన్యూ భూసమస్యల పరిష్కారం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటారు. ఉదాహరణకు.. టీఎం-33 మాడ్యూల్ కింద మ్యుటేషన్, సక్సేషన్ వంటి సమస్యల పరిష్కారం కోసం మీసేవకు వెళ్లి ఆన్‌లైన్‌లో నిర్ధారిత చార్జీలు చెల్లించి అర్జీ పెట్టుకుంటారు. ఆన్‌లైన్ అయిన తర్వాత రైతు దరఖాస్తు చేసుకున్న కాగితాలతోపాటు తన దగ్గర ఉన్న భూమి ఆధారాలను ఎమ్మార్వో ఆఫీసులో అందజేస్తారు. వాటిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించాలి. వివిధ మాడ్యూళ్ల కింద టెక్నికల్ సమస్యల పరిష్కారానికి, పెండింగ్‌లో ఉన్న నాలా పరిష్కారం కోసం, మాడిఫికేషన్ రిక్వెస్ట్‌కు సంబంధించి మిస్సింగ్ సర్వే నంబర్లు పట్టాదారు పేరు మార్పులు చేర్పులు, విస్తీర్ణంలో తేడాల వాటి సవరణ, ఖాతా మెర్జింగ్, నిషేధిత జాబితా నుంచి తొలగింపు, డూప్లికేట్ పట్టాదారు పాసు పుస్తకాలు.. ఇలా విభిన్న రెవెన్యూ సమస్యల కోసం భూయజమానులు మీసేవ కేంద్రాల్లో ఫీజులు చెల్లించి దరఖాస్తు చేసుకుంటారు. ఉదాహరణకు.. మ్యుటేషన్ ఆఫ్ ల్యాండ్‌కు ఒక్కో ఎకరానికి రూ.2,500, పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్‌కు రూ.300 చెల్లించాలి. ల్యాండ్ కన్వర్షన్‌కు బేసిక్ వ్యాల్యూలో 3 శాతం చెల్లింపులు చేయాలి. ఇలా ఒక్కోదానికి ఒక్కో ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఒకసారి రిజెక్ట్ చేస్తే తిరిగి మళ్లీ దరఖాస్తు చేసుకోవటమే కాదు.. మళ్లీ నిర్ధారించిన ఫీజులు చెల్లించాలి. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి.. అనర్హత ఉంటేనే కారణం చెప్పు దరఖాస్తును తిరస్కరించాలి. కానీ, కాంగ్రెస్ సర్కారు హయాంలో ఇవేవీ లేకుండా విచ్చలవిడిగా దరఖాస్తులను రిజెక్ట్ చేశారు. జూలై 5 నుంచి 10 మధ్యే భారీగా దరఖాస్తులను తిరస్కరించినట్టు సమాచారం.

రెండు సార్లు దరఖాస్తును తిరస్కరించారు

కోనరావుపేటలో మా తల్లి చందనగిరి రామలక్ష్మి, తండ్రి రామస్వామి పేరు మీద 0.07 గుంటల భూమి ఉన్నది. ఆమె మరణించగా మా అన్నదమ్ములమంతా కలిసి విరాసత్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాం. ఆ భూమికి పాస్‌బుక్, పాత పహాణీలను జతచేసి ఎమ్మార్వో ఆఫీసులో అందజేశాం. కానీ అధికారులు వాటిని పరిశీలించకుండా ఆన్‌లైన్‌లో భర్త పేరు తప్పుగా ఉందని రిజెక్ట్ చేశారు. ఆరు నెలలుగా రెవెన్యూ ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నా.. రెండు సార్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా రెండు సార్లు రిజెక్ట్ చేశారు. దీంతో డబ్బులు నష్టపోవడంతోపాటు భూమి ఆన్‌లైన్ కాకపోవటంతో అన్ని విధాలుగా నష్టపోతున్నాం. అడిగితే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్తున్నారు.

– చందనగిరి రాజేశం, రైతు, కోనరావుపేట, రాజన్న సిరిసిల్ల జిల్లా

సర్కారు ఒత్తిడి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్‌ను అభాసుపాలుచేసే కార్యక్రమాన్ని పెట్టుకున్నది. బడ్జెట్ సమావేశాల్లో సమాధానం చెప్పాల్సి వస్తుందని భావించి, జూలై మొదటి వారంలో దరఖాస్తుల పరిష్కారం కోసం ప్రభుత్వం ఒత్తిడి పెట్టింది. జూలై 10లోగా ఆన్‌లైన్‌లో ఉన్న దరఖాస్తులకు ఏదో ఒక పరిష్కారం చూపాలని పైనుంచి ఒత్తిడి పెరిగింది. ఆమేరకు కలెక్టర్లు సిబ్బందిపై ఒత్తిడి చేయటంతో.. తహసీల్ కార్యాలయంలో ఉన్న సిబ్బందితో క్షేత్రస్థాయిలో పరిశీలించే సామర్థ్యం లేక పైఅధికారులకు అన్నీ క్లియర్ చేశామని చెప్పుకోవడానికి తిరస్కరణ ప్రక్రియ చేపట్టి చేతులు దులుపుకున్నట్టు తెలుస్తున్నది. దీనివల్ల ఫీజులుగా చెల్లించిన రూ.కోట్లను రైతులు నష్టపోయారు.

మంత్రుల ప్రకటనల మధ్య తేడాలు

బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజు (జూలై 25న) ఉప ముఖ్యమంత్రి చెప్పిన మాటలు, చేసిన ప్రకటనలకు.. ఇదే అంశంపై ఆగస్టు 2న జరిగిన చర్చలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పిన మాటలకు చాలా వ్యత్యాసం ఉన్నది. బడ్జెట్ ప్రవేశ ప్రసంగం సందర్భంగా భట్టి.. 'ధరణి అమలు వల్ల వచ్చిన సమస్యలను అధ్యయనం చేయడానికి ఒక కమిటీని నియమించాం. ఆ కమిటీ సూచనల మేరకు మొదటి దశలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించడానికి మార్చి 1 నుంచి 16 వరకు కలెక్టర్ల ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. 2024 మార్చి ఒకటి నాటికి 2,26,740 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, కొత్తగా 1,22,774 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 3,49,514 దరఖాస్తుల్లో మార్చి ఒకటి నుంచి బడ్జెట్ ప్రవేశపెట్టే నాటికి 1,79,143 దరఖాస్తులను పరిష్కరించింది' అని చెప్పారు. ఆగస్టు 2న శాసనసభలో చర్చ జరిగింది. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. 'మేం అధికారంలోకి వచ్చేనాటికి ధరణిలో 2.45 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో 1.19 లక్షలను క్లియర్ చేశాం. మళ్లీ లక్షకుపైగా దరఖాస్తులు వచ్చాయి. వాటిని మూడు వారాల్లోగా పరిష్కరిస్తాం' అని వెల్లడించారు. ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమిటంటే.. మార్చి ఒకటి నాటికి 2,26,740 దరఖాస్తులు వచ్చాయని భట్టి చెప్తే, పొంగులేటి మాత్రం అధికారంలోకి వచ్చే నాటికే 2.45 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దరఖాస్తులు అధికంగా పెండింగ్‌లో ఉన్నాయని చూపి గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బదనాం చేయాలనే పొంగులేటి తప్పులు చెప్పారన్న విమర్శలు అప్పుడే వచ్చాయి. 1.79 లక్షల దరఖాస్తులను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించినట్టు బడ్జెట్ ప్రసంగంలో భట్టి చెప్పగా.. 1.19 లక్షల దరఖాస్తులను క్లియర్ చేసినట్టు పొంగులేటి చెప్పటం గమనార్హం.

ధరణితో రైతు భూమికి భద్రత

ధర